తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

# చెరువులో పడి... ఇద్దరు విద్యార్థులు మృతి

**- బిఎల్ కండ్రిగలో విషాదం**

బంగారుపాళ్యం, జూన్ 3 ప్రభాతవార్త: చెరువులో పడి ఇదరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన మండలంలోని బిఎల్ కండ్రిగ ఎస్టీ కాలనీలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామ సమీపంలోని చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్ళిన వరుసకు అక్కా తమ్ముళ్ళు మృతి చెందారు. గ్రామానికి చెందిన లోకేష్ భార్య జ్యోతి బట్టలను ఉతకడానికి గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్ళింది. ఆమెతో పాటు ఆమె కుమార్తె సత్య(14), మరిది కుమారుడు రోహిత్(9) ఇరువురు వెళ్ళారు. జ్యోతి చెరువులో బట్టలు ఉతుకుతున్న సమయంలో చెరువు ప్రక్కనే వున్న నీటి గుంతలో సరదాగా ఈత ఆడటానికి సత్య, రోహిత్‌లు దిగారు. ఈ నీటి గుంత లోతుగా వున్న విషయంను గుర్తించక పోవడంతో నీటిలో ఇరువురు మునిగిపోతూ కేకలు వేశారు. ఈ విషయంను గుర్తించి ప్రక్కనే వున్న జ్యోతికి సైతం ఈత రాకపోవడంతో పిల్లలను కాపాడాలని గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో చుట్టుప్రక్కల ఎవరు లేకపోవడంతో నీటి గుంతలోనే మునిగి సత్య, రోహిత్‌లు మృతి చెందారు. ఈ సంఘటన తెలిసిన గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు సంఘటనా స్థలం చేరుకుని నీటి గుంతలో మునిగి వున్న మృతదేహాలను వెలికి తీయించారు. శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్టీ కాలనీకి చెందిన ఇద్దరు పిల్లలు చెరువులో పడి మృతి చెందడంతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా మృతి చెందిన సత్య చిత్తూరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి, మృతుడు లోహిత్ గ్రామంలోనే 3వ తరగతి చదువుతున్నాడు.



మృతి చెందిన సత్య, రోహిత్

# ప్రజా సమస్యలను... మండల స్థాయిలోనే పరిష్కరించండి

**-పరిష్కారంలో అలసత్వం సహించేది లేదు : జిల్లా కలెక్టర్**



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 3 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశా లతో జిల్లా వ్యాప్తంగా జూన్ 7 నుండి జూన్ 20 వరకు రెండు వారాలు యోగాంధ్ర కార్యక్రమా లను నిర్వహించడం జరుగు తుందని, సంబంధిత అధికారులు సమన్వ యంతో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం పిజిఆర్ ఎస్ వినతుల పరిష్కారం, జలాధార- జల హారతి, యోగాంధ్ర, పాఠశాల పునః ప్రారంభం, తదితర కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ బంగ్లా నుండి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి పిజిఆర్ఎస్ కు వచ్చే సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, మండల స్థాయిలో సమస్యల పరిష్కారం పై అలసత్వం చూపుతున్న కారణంగా జిల్లా స్థాయిలో నిర్వహించే పి జి ఆర్ ఎస్‌కు వినతులు పోటెత్తుతున్నాయన్నారు. జిల్లాలో ఏప్రిల్ 6 నుండి జూన్ 1 వరకు సుమారు 9 వారాల పాటు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం లో మండల స్థాయిలో ఒక్క దరఖాస్తు కూడా అందకపోవడం శోచనీయమ న్నారు. తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు, మున్సి పల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమం పై అవగాహన కలిగించాలన్నారు. పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జలాధార-జలహారతి కార్యక్రమం ద్వారా జిల్లాలో డ్వామా, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఉపయోగపడే విధంగా మిగిలిన కార్యక్రమాల కంటే ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 80 శాతం పనులు పూర్తి కావడం జరిగిందని, మిగిలిన పనులు శుక్రవారం లోపు పూర్తి చేయాలన్నారు. జలాధార- జలహారతి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ పనులు చేపట్టి భూగర్భ నీటి మట్టం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో ఏపిఓ, ఎంపిడిఓ, ఇరిగేషన్ ఏఈ లు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన జలధార-జల హారతి పథకం లో భాగంగా మండల పరిధిలో చేపట్టిన నీటి సంరక్షణ పనుల పై ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమం పై ప్రణాళికలను రూపొందించాలన్నారు. జూన్ 12 నుండి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో తరగతి గదులు, విశ్రాంతి గదులు, వంట గది, మరుగుదొడ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగు నీటి ట్యాంక్ లను శుద్ధి చేయించి నీటిని నింపాలని సూచించారు. వంట శాలకు అవసరమైన సామగ్రితో పాటు వంట గ్యాస్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగాంధ్రలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 7నుండి 20వరకు రెండు వారాలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, మండల స్థాయిలో ఎంపిడిఓలు, జిల్లా స్థాయిలో సోషల్ వెల్ఫేర్ డిడిలు నోడల్ అధికారిగా ఉండి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమం లో భాగంగా జూన్ 7న ఎస్‌విజూ పార్క్ నందు జూన్ 12న చంద్రగిరి కోట నందు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన మాస్టర్ ట్రైనర్ల ఎంపిక, పిడి ట్రైనర్‌ల ఎంపిక చేపట్టాలన్నారు.

టూరిజం, డిఈఓ, సంక్షేమ వసతి గృహాల అధికారులు కార్యక్రమ నిర్వహణ భాధ్యత చూసుకోవాలన్నారు. ఎన్‌జిఓలను, యోగా అభ్యాసకులను కార్యక్రమం లో భాగస్వామ్యం చేసి పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఆర్ డబ్ల్యూ ఎస్ఏఈలు, డ్వామా ఏపిడిలు, ఏపిఓలు, సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దడపుట్టిస్తున్న... బియ్యం ధరలు

**మంటలు పుట్టిస్తున్న వంటనూనెలు**

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త: పెట్రోల్ ధరలు పెరుగుదల ప్రభావం నిత్యావసర సరకుల పెరుగుదలపై పడుతుంది. గత నెల రోజులుగా బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దాంతో సామాన్యుడు తల్లడిల్లుతున్నారు. గతంలో ఈ సీజన్‌లో బియ్యం ధరలు ఎంతో అనుకూలంగా ఉండేవి. కానీ ఎందుకో ఈ సీజన్‌లో బియ్యం ధరలు పెరుగుతున్నాయి. మరో వైపు వంట నూనెల్లో విడి పామోలిన్ అయిల్ దొరకక పోగా ధరలు విపరీతంగా పెరుగుతుంది. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు పంటల ధాన్యాగారంగా ఉన్నాయి. ఇక్కడ బుడ్డల బియ్యం పంటను విపరీతంగా పండిస్తున్నారు. పచ్చిబియ్యం, హాఫ్‌బాయిల్ బియ్యాలు సమీపంలోని సూళూరుపేట నుంచి వస్తాయి. అంతేకాక బ్రాండెడ్ బియ్యాలు వస్తున్నాయి. శ్రీకాళహస్తిలో సుమారు 50కి పైగా బియ్యం విక్రయ కేంద్రాలున్నాయి. ఇక్కడ రక రకాల బియ్యం దుకాణాలున్నాయి. నేడు బియ్యం ధరలు హాఫ్‌బాయిల్ బియ్యం 26కిలోల బస్తా రూ.వెయ్యి నుంచి 1100లు ఉండేది. అయితే ప్రస్తుతం బస్తాపై రూ.200లు పెరిగి రూ.1300లకు చేరింది. పచ్చిబియ్యాల ధరలు కూడా పెరిగాయి. ఒకకిలో రూ.70లకు పెరిగిందిబుడ్డల ధరలు పెరుగుతు న్నాయి. ఇక వంటనూనెల ధరలు పెరుగుతున్నాయి. రిఫైండ్ నూనెల ధరలు పెరగటం లేదు. కానీ పామొలిన్‌ధరలు కిలో రూ.170లకు చేరింది. ఒకకిలో నూనెపై రూ.20లు పెరిగింది. పెట్రోల్ ధరలు పెరిగిన కొద్ది ఇక్కడ నిత్యావసర సరకుల ధరలు పెరుగుతాయని అంటున్నారు. ధరల పెరుగుదలతో సామాన్యుడు, మధ్యతరగతి ప్రజల బతుకులు ఇబ్బం దులకు గురౌతున్నాయి. ఓ వైపు సంపాదన పెరగక పోగా ధరల దరువుతో దడపుడుతుంది. ఇక నిత్యావసర సరకులు ప్రభుత్వం రేషన్‌షాపుల్లో సరఫరా చేసేవి సక్రంగా నిరుపేదలకు అందటంట లేదు. దానిని పర్యవేక్షించే దిక్కులేదు. నెలకు ఇచ్చే అర్థకిలో చక్కెర కూడా సక్రమంగా అందించటం లేదు.



మార్కెట్ దుకాణాల్లో బియ్యం

## చంద్ర,సూర్యప్రభలపై కల్యాణ వెంకన్న

తిరుపతి, జూన్ 3ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని నారాయణవనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి చంద్రప్రభవాహనంపై, ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. నవనీత కృష్ణుడు అలంకారంలో చంద్రప్రభ వాహనంపై ఊరేగిన స్వామివారు భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. చంద్రుని శీతల కిరణాలవలె ప్రశాంతమైన తేజస్సుతో వెలుగొందిన స్వామివారి రూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంతో గోవింద నామస్మరణలు చేస్తూ ఆనందభాష్పాలతో స్వామివారిని సేవించారు. సూర్యకిరణాల తేజస్సును తలపించే ఈ వాహనసేవలో స్వామివారి అపూర్వ రాజసం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓనాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

**పుత్తూరు పోస్టర్ ఆవిష్కరించిన వైకాపా నాయకులు**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైకాపా నాయకులు

పుత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సా ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా, మాజీ ఎంపి రెడ్డెప్ప ఆరోపించారు. 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట ముద్రించిన పోస్టర్లను బుధవారం పుత్తూరు పట్టణంలో వీరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలపుడు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు నమ్మి... జనం మోసపోయారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన దూరమైందన్నారు. ప్రజలు తిరిగి జగనన్న పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో 4, 5 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలపై మండలాల వారీగా పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టి సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు.

**-దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేస్తున్న నేత**

# కూటమి నేతల చేష్టలతో ... వైసిపి చేతికి ప్రచార ఆయుధాలు

**తిరుపతి, జూన్ 3ప్రభాతవార్తబృందం:**

సిఎం చంద్రబాబు సొంత జిల్లాలో తిరుపతిలో కొందరు కూటమి పార్టీల నేతలు చేస్తున్న చేష్టలతో వైసిపి నేతల చేతికి బలమైన ఆయుధాలు ఇస్తున్నట్లు వ్యవహారం తయారైంది. ఏకంగా ఓ నాయకుడు చంద్రబాబు బంధువునంటూ తిరుపతిలో ఆయన మాట శాసనంగా జనాన్ని కూడా ముప్పుతిప్పలు పెడుతున్నాడని వైసిపి నేతల ఆరోపణలు. ఆ నాయకుడి తీరుతో తిరుపతిలో టిడిపి పరువు పోతోందని ఆ పార్టీల నేతలు అంతర్మథనం చెందుతున్నారు. కొందరు నేతల తీరుతో తిరుపతిలో టిడిపి ప్రతిష్ట రోజు రోజుకు తగ్గి పోతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పార్టీలో వర్గపోరుతో పార్టీ చతికిల పడింది. రౌడీయిజం, భూ కబ్జాలు చేస్తున్నారంటూ వైసిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న తిరుపతిలో ఇప్పుడు రాజకీయ పోరు రచ్చ కెక్కింది. కూటమి నేతలు చేస్తున్న తప్పులు వైసిపికి ఆయుదాలుగా మారాయి. బుధవారం అలిపిరి వద్ద అరకు టీ సెంటర్ కోసం తొలగించిన పేదవారి షాపులు పునరుద్ధరించాలి అంటూ వైసిపి నేతలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. వైసిపి తిరుపతి ఇన్‌చార్జి అభినయ్ రెడ్డితో పాటు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. పదిరోజుల క్రితం శివజ్యోతి నగర్‌లో జర్నలిస్టుల పేరుతో భూ కబ్జాలు జరుగుతున్నాయంటూ వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శలు చేశారు. ఆయన కుమారుడు తిరుపతి భూమన అభినయ్‌రెడ్డి ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ వైసిపి నేతలు నిరసనలు, ధర్నాలు చేస్తున్నారు. దీంతో కూటమి నేతలు ఆత్మ రక్షణలో పడ్డారు. వీటన్నింటి వెనక ఓ బలమైన నేత హస్తం ఉందని వైసిపి నేతలు ఆరోపిస్తున్నారు. టిడిపికి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు కూడా ఆయనపై ఫిర్యాదులు చేశారని తెలిసింది. ఆ నేత ఏకంగా మంత్రి లోకేష్ పేరు చెప్పుకుని నగరంలో కొందరు నాయకులను జత కట్టుకుని పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శివజ్యోతి నగర్ లోని కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేయడానికి టిడిపి నేతలు కొందరు కలసి మహిళలపై దౌజన్యం చేశారని ఆరోపణలు ఉన్నాయి. కోర్టులో కేసు ఉన్న భూమిపై అధికార జులుం చూపారని అంటున్నారు. దీనిని అడ్డుకుని వైసిపి నేతలు ప్రజల దృష్టిలో హీరోలు అయ్యారు. అలిపిరి వద్ద అరకు టీ సెంటర్ కోసం కూటమి నేతలు పలు తోపుడు బండ్లు, షాపులను తొలగింప చేశారని అంటున్నారు. ఏకంగా కొందరు నేతలు అధికారులను భయపెట్టుకుంటున్నారని కొందరు టిడిపి నేతలు అధిష్టాన వర్గం దృష్టికి తీసుకుని వచ్చారు. పార్టీకి మేలు చేస్తాడని లోకేష్ చేరదీసి పదవి ఇస్తే పార్టీకి అప్రతిష్ట తీసుకుని వస్తున్నారని పార్టీలో కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# పచ్చని గ్రామంలో...సోలార్ చిచ్చు!

**- 405 వృక్షాలు నేలమట్టం చేసిన నెడ్‌క్యాప్ సంస్థ - దేవాలయ భూమిని ఏకపక్షంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అప్పగింత - సోలార్ ప్లాంట్ వద్దని ఆందోళన దిశగా 52 గ్రామాల ప్రజలు**

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త: పచ్చని గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చిచ్చు రేపింది. దేవాదాయ శాఖ ఆధీనంలో వున్న భూమిలో ఏకపక్షంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయం తీసుకొని 52 గ్రామాల ప్రజలకు అన్యాయం చేశారని ఆ గ్రామాల ప్రజలు ప్రస్తుతం రోడ్డెక్కి పోరాటాలకు సిద్ధం అవుతున్నారు. అయితే దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు ఇందులో తమ పాత్ర ఏమి లేదని దేవాలయ కమిటీ సభ్యుల సమ్మతితోనే దేవాలయ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడంతో ప్రభుత్వం ఇందుకు సంబంధించి జిఓఎంఎస్ నెం.59 జారీ చేసిందని పేర్కొంటున్నారు. యాదమరి మండలం దాసరాపల్లి గ్రామంలోని శ్రీ ధర్మరాజుల స్వామి దేవాలయంకు ఆ గ్రామంలోనే సర్వేనెం.276లో 10.60 ఎకరాల విస్తీర్ణం భూమి వుంది. ఈ భూమిలో గత శతాబ్ద కాలంగా మామిడి, చింత, ఇతర పెద్ద వృక్షాలు వుండటం, ప్రతి ఏడాది ఈ తోటల ఫలసాయంతో ఆలయంలో మహాభారత ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం నెడ్‌క్యాప్ సంస్థకు ఈ దేవాలయంకు చెందిన 10.60 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడానికి భూమిని లీజుకు ఇస్తూ ప్రభుత్వం జిఓనెం.59ను జారీ చేయడంతో 52 గ్రామాల్లోని ప్రజల్లో చిచ్చు రేపింది. దేవాలయ పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు ఏకపక్షంగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం, దీనిపై ప్రభుత్వం జిఓనెం.59ను జారీ చేసి నెడ్‌క్యాప్ సంస్థకు ఈ భూమిని లీజుకు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ భూముల్లో ఏళ్ళ తరబడి ఏపుగా పెరిగిన మామిడి, వేప, చింత చెట్లను లీజుకు తీసుకున్న సంస్థ నరికివేస్తుం డటంతో గ్రామస్తులు ఉద్యమానికి సిద్ధం అవుతున్నారు. ఈ భూమిలో సుమారు 405 మామిడి, వేప, చింత చెట్లు వున్నాయి. దేవాలయ భూమిలో ఏపుగా పెరిగిన చెట్లు వుండగా రెవెన్యూ అధికారులు భూమి ఖాళీగా వుందని నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం జిఓ జారి చేసిందని గ్రామస్థులు ధ్వజమెత్తుతున్నారు. ఈ భూమి నెడ్‌క్యాప్ సంస్థకు లీజుకు గ్రామస్తుల అంగీకారంతో ఇవ్వడం జరిగిందని దేవాదాయ అధికారులు పేర్కొంటున్నప్పటికీ దేవాలయ పరిధిలోని 52 గ్రామాల్లోని ఒక్కరు సైతం గ్రామసభకు హాజరై సంతకాలు పెట్టలేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దేవాదాయ చట్టం సెక్షన్ 80 ప్రకారం కమీషనర్ అనుమతి లేకుండా దేవుడి భూమిని లీజుకు ఇవ్వడం చెల్లదని, అయితే ఇక్కడ అసిస్టెంట్ కమీషనర్ నివేదిక మేరకు ప్రభుత్వ జిఓ జారీ చేసిందని ఈ జిఓ చెల్లదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అలాగే దేవాలయ భూమిలో సుమారు 405 పెద్ద వృక్షాలను నెడ్‌క్యాప్ సంస్థ ఎవరి అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా నరికివేసిందని, ఈ సంస్థ వాల్టా చట్టం ఉల్లంఘించడంతో ఆ సంస్థకు పెద్ద మొత్తంలో జరిమానా విధించాలని దేవాలయ పరిధిలోని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి సంస్థకు లీజును సత్వరం రద్దు చేయాలని, తప్పుడు నివేదిక ఇచ్చిన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని, నరికిన చెట్లకు నెడ్‌క్యాప్ సంస్థ నుండి నష్టపరిహారం వసూలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయ భూములను పరిరక్షించడానికి గ్రామస్తులు హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను సైతం ఆశ్రయించడం, మరోవైపు స్థానికంగా 52 గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో పోరాటం తలపెట్టడానికి సిద్ధం అవుతుండటంతో ఈ వ్యవహారం మరింత ముదిరే అవకాశం కన్పిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.



పచ్చగా వున్న మామిడి తోటలు ప్రస్తుతం కన్పించని వైనం(ఫైల్‌ఫోటో)- జెసిబిలతో నేలమట్టం అయిన తోటలు, పెద్ద వృక్షాలు

# బీజేపీని బలోపేతం చేయాలి

**-రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్**



చిన్నగొట్టిగల్లు, జూన్ 3 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. చిన్నగొట్టిగల్లు మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పార్టీ విస్తరణ, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. మండల అధ్యక్షుడు కిషోర్ కుమార్ నాయకత్వంలో పార్టీ గ్రామ గ్రామానికీ చేరువైందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని, యువతను ఆకర్షిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి శ్రమిస్తున్న ప్రతి కార్యకర్త అభినందనలకు అర్హుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కిషోర్ రాయల్, రాష్ట్ర యువమోర్చా నాయకుడు జీవన్ రాయల్ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇద్దరు నాయకుల మధ్య నలిగి పోతున్న కార్యకర్తలు**

# అన్న క్యాంటిన్ ఒకటే...ప్రారంభోత్సవాలు రెండు

సత్యవేడు, జూన్ 3 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం సత్యవేడులో పేద ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాంటిన్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజన సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది తెలుగుదేశం పార్టీ అన్న ఎన్‌టీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌లో భాగంగా సత్యవేడులో ప్రారంభమైన ఈ క్యాంటిన్ 270వ అన్న క్యాంటిన్‌గా నిలిచిందని ఆయన తెలిపారు. రూ.5లకే నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటిన్లు పేదలు, కార్మికులు, వృద్ధులు, దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాల యాలకు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. పేదవాడి కడుపు నింపే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి సమక్షంలో మరొకసారి అన్న క్యాంటిన్‌కి సత్యవేడు తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి సమక్షంలో రిబ్బన్ కట్ చేసి అబ్బా అనిపించుకున్నారు. మొత్తానికి సత్యవేడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఈ అన్న క్యాంటిన్ సాక్షిగా ఒకే కార్యక్రమం రెండుగా జరగడంతో నాయకులు, కార్యకర్తలు నలిగి పోతున్నట్లు బహిరంగ పేర్కొంటున్నారు. త్వరలోనే అధిష్టానం సత్యవేడు నియోజకవర్గ రాజకీయాల్లో ఏదో ఓ నిర్ణయం తీసుకుని కార్యకర్తలు, నాయకులు న్యాయం చేస్తుందని నియోజకవర్గ నాయకులు ఎదురు చూస్తున్నట్లు టీడీపీ కార్యకర్తలు అనుకుంటున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్, విక్రమ్, విద్యాశాఖ అధికారి రవి, నాయకులు సుందరరామిరెడ్డి, లోకయ్య, చిన్న ఇళంగోవన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బాషా, కిష్టయ్య, బాబుయాదవ్, శశి, ప్రభాకర్, కోనయ్య, అమాసరెడ్డి, వైసీపీ జడ్పీటీసీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడులో అన్న క్యాంటిన్ రిబ్బన్ కట్ చేసి రెండవ సారి ప్రారంభిస్తున్న కూరపాటి

# నేడు కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

పలమనేరు రూరల్, ప్రభాతవార్త జూన్ 3 :




రానున్న మూడు రోజుల్లో కేరళను నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. ఈనెల తొమ్మిదవ తేదీ రాయలసీమకు రుతుపవనాలు ఎల్‌నినో ప్రభావంతో భూ మధ్యరేఖను దాటి హిందూ మహాసముద్రం వైపు వీస్తున్న రుతుపవన గాలులు క్రమేపీ బలపడుతున్నాయి. ఇంకా కేరళకు ఆనుకుని ఆగ్నేయ అరేబియా సముద్రం, కేరళ, తమిళనాడుకు ఆనుకుని వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో గత రెండు రోజులుగా కేరళలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రానున్న రెండు, మూడు రోజుల్లో కేరళ, తమిళనాడులోని పలు ప్రాంతాలను నైరుతి రుతు పవనాలు తాకనున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అలాగే, మూడు లేదా నాలుగో తేదీన రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. రాయలసీమను ఈనెల ఏడు లేదా తొమ్మిదో తేదీన రుతుపవనాలు తాకనున్నాయన్నారు. కాగా, రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించిన తర్వాత దక్షిణాదిలో మిగిలిన ప్రాంతాలకు విస్తరణ నెమ్మదిగా సాగుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. దీంతో ఎండ తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది. కాగా.. నెల్లూరు జిల్లా గూడూరులో 43.6, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 43.3, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 43.1, చిత్తూరు జిల్లా సింధురాజపురంలో 42.2, పల్నాడు జిల్లా మాచర్లలో 41.5, నంద్యాల జిల్లా సంజామల, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, గాలులతో వర్షాలు, చెదురుమదురుగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో మంగళవారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ అధికారులు తెలిపారు.

## చిన్నారుల మానసిక వికాసంకు నవచేతన కీలకం

– స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరీ

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:




చిన్నారుల మానసిక వికాసానికి నవచేతన కీలకమని స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరీ అన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశభవనంలో బుధవారం మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవచేతన ఎఐ యాప్ చిన్నారుల స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా పిడి వెంకటేశ్వరీ మాట్లాడుతూ నవచేతన స్క్రీనింగ్ కార్యక్రమంతో చిన్నారుల మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పిల్లల మానసిక వికాసానికి నవచేతన కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధిలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని, ఈ దశలోనే ఎదుగుదల లోపాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నవచేతన కార్యక్రమంను అమలు చేస్తుందన్నారు. పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రకటరీ ఎ.సూర్యకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ శిక్షణలో పలమనేరు సిడిపిఓ ఉమావాణి, పిడియాట్రీషన్లు డాక్టర్ పి.చైతన్య, డాక్టర్ వి.రాజేష్‌కుమార్, జిల్లాలోని సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా అబార్షన్ మందులు విక్రయించే మెడికల్ షాపు సీజ్

– లింగ నిర్ధారణ ఎక్కడైనా జరిగితే కఠిన చర్యలు

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:



చిత్తూరు నగర పరిధిలో పొన్నియమ్మన్ గుడి వీధిలోని ఓ ప్రముఖ మెడికల్ షాపులో అబార్షన్ చేయడానికి అవసరమైన మందులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని సమాచారం వుండటంతో ఆ మెడికల్ షాపును సీజ్ చేయాలని జిల్లా స్థాయి పిసిపిఎన్‌డిటి యాక్ట్ కమిటీ సభ్యులు తీర్మానించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఛాంబర్‌లో బుధవారం డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి పిసిఅండ్‌పి ఎన్‌డిటి యాక్ట్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బంగారుపాళ్యం మండలం చంద్రశేఖరపురం వద్ద వైద్య ఆరోగ్యశాఖకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా, పోలీసుల సహకారంతో క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తే ఒక నిర్దిష్ట ప్రదేశంలో గర్భిణీ స్త్రీల అనుమానస్పద రాకపోకలు గుర్తించడం, ఆపై చట్ట విరుద్దంగా నిర్వహిస్తున్న లింగ నిర్ధారణ పరీక్షలపై దాడులు నిర్వహించి నిందితులను పట్టుకున్న డాక్టర్లు లోహిత్, చెంగల్రాయన్‌లను కమిటీ అభినందించింది. అలాగే బంగారుపాళ్యం మండలం చంద్రశేఖరపురం వద్ద జరిగిన దాడులపై ప్రైవేటు కేసు దాఖలు చేయాలని కమిటీ తీర్మానించింది. అలాగే జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు లేదా స్కానింగ్ సెంటర్లలో చట్టవిరుద్దంగా లింగ నిర్ధారణ జరిగినా, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆసాంఘీక ఆబార్షన్లు జరుపుతున్నట్లు తెలిస్తే కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యుటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ లత, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, సుబ్రమణ్యం, భానుమూర్తి, ఇంద్రాణి, రాజేంద్రప్రసాద్, శేషాద్రి, రామారావు, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ దోహదం : డిఎస్పీ

కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ఎంతో దోహదపడుతుందని డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా కుప్పంలో యువకుల సైకిల్ ర్యాలీని డిఎస్పీ పార్థసారథి, కమీషనర్ శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంధన పొదుపుపై అవగాహన కోసం ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. సైకిల్ వినియోగంతో చక్కటి ఆరోగ్యం, శారీరక వ్యాయామం జరుగుతుందన్నారు. యువత సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైక్లిస్ట్ రాజు, స్థానిక యువత పాల్గొన్నారు.

## పశుసంవర్ధక పాలిటెక్నిక్ కోర్సులందు సువర్ణ అవకాశాలు

పలమనేర్ రూరల్, ప్రభాతవార్త జూన్ 3 :




పదవ తరగతి పూర్తిచేసుకుని చాలా మంది విద్యార్థి విద్యార్థునులు తల్లిదండ్రులు ఒక సందిగ్ధంలో పడిపోతారు. ఇంటర్ చదవాలా, ఐటీఐ చదవాలా, పాలిటెక్నిక్ చదవాలా,లేక ఇంకేదైనా కోర్సు ఎంచుకోవాలాఅనే,ప్రశ్న ఎదురవుతుంది. గ్రామీణ విద్యార్థి విద్యార్థును లకు సువర్ణ అవకాశం ఇవ్వనున్న పశుసంవర్ధక పాలిటెక్నిక్ కోర్సులు. 2026–27 విద్యా సంవత్సరానికి ఈ కోర్సు ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సు రెండు సంవత్సరాల వ్యవధి కలిగి ఉంటుంది. ఈ రెండు సంవత్సరాలలో పశుసంవర్ధక రంగానికి సంబంధించిన అన్ని ప్రాథమిక మరియు ప్రాయోగిక అంశాలను నేర్పిస్తారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం, పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ, టీకాలు, డెయిరీ నిర్వహణ, పశుగ్రాసం తయారీ, పౌల్ట్రీ నిర్వహణ వంటి అనేక విషయాలపై శిక్షణ ఇస్తారు. గ్రామాల్లో ఎక్కువ కుటుంబాలు వ్యవసాయం లేదా పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాయి. కానీ సరైన అవగాహన లేకపోవడం వల్ల పశువుల ద్వారా రావాల్సిన ఆదాయం రావడం లేదు. ఈ కోర్సు చదివిన విద్యార్థి తన కుటుంబానికి, తన గ్రామానికి ఉపయోగపడే జ్ఞానాన్ని సంపాదిస్తాడు. పశువులకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించడం, సరైన ఆహారం అందించడం, పాల ఉత్పత్తిని పెంచడం వంటి విషయాలలో నైపుణ్యం సంపాదిస్తాడు. ఈ కోర్సు పూర్తయిన తర్వాత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ, రైతు భరోసా కేంద్రాలు, డెయిరీ సంస్థలు, పౌల్ట్రీ పరిశ్రమలు, పశువుల ఫీడ్ కంపెనీలు, ప్రైవేట్ వెటర్నరీ సేవా సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన కృష్ణవేణి, నారాయణ దంపతులు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ముగుస్తున్న వేసవి సెలవులు...

కాణిపాకంలో కొనసాగుతున్న రద్దీ –దర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



పాఠశాలలు, విద్యాసంస్థలకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయంలో రద్దీ కొనసాగుతోంది. బుధవారం కూడా భక్తుల రద్దీతో కాణిపాకం ఆలయం కిటకిటలాడింది. ఆలయంలో రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతుండడంతో కాణిపాకం ఆలయ భక్తజన సంద్రంగా తయారైంది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు విద్యాసంస్థలు, పాఠశాలలకు వేసవి సెలవులు మరో వారం రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. అలాగే ఆలయంలో సంకట హర చతుర్థివ్రతం జరగడంతో వ్రతం నిర్వహించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్ల వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## శ్రీదుర్గా మల్లేశ్వరస్వామిని దర్శించుకొన్న ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామిని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్‌మోహన్ రాష్ట్ర ఉపసభాపతి కె రఘు రామకృష్ణమరాజు, ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్‌లతో కలసి దర్శించుకొన్నారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకొన్న వీరికి అధికారులు, అర్చకులు స్వాగతం పలకగా శ్రీదుర్గమ్మ తల్లిని, శ్రీమల్లేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించగా, ఆలయ అధికారులు శేషవస్త్రాలు, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బూత్ ఏజెంట్లదే కీలక పాత్ర

– నియోజకవర్గ తెదేపా పరిశీలకురాలు పురిమిట్లకుమారి

చిత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:




ఎన్నికల కమీషన్ చేపట్టిన సర్( ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలు ప్రధానంగా బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలని చిత్తూరు నియోజకవర్గ తెదేపా పరిశీలకురాలు పురిమిట్ల కుమారి పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మార్గనిర్దేశంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చిత్తూరు రూరల్ మండలం, నగరపాలపరిధిలోని 10 క్లస్టర్ల పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, ప్రధానకమిటీ సభ్యులు, అనుబంధ కమిటీల సభ్యులకు బుధవారం సర్‌పై ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జూన్ 15 నుంచి జూలై 15వరకు క్షేతస్థాయిలో సర్ సర్వే జరుగుతుందనీ, ఈ సమయంలలో బూత్‌స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా వుండాలని, ప్రతి ఒక్క ఓటరు చేత ఫారం 2 సక్రమంగా పూర్తి చేయించి సమర్పించాలన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా చూడాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రకుమార్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చయప్ప, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు, డివిజన్, ప్రధాన కమిటీ అనుబంధ కమిటీల సభ్యులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## 7న రాష్ట్ర రజకసంఘ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం

చిత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం నందు రాష్ట్ర రజకసంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంను ఈనెల 7వ తేది ఆదివారం కళైబాల కళ్యాణమండం నందు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మెన్, ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల సమాఖ్య వ్యవస్థాపక చైర్మెన్ పి షణ్ముగం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా బిసి వర్గాలకు సంబంధించి గీత కార్మికులకు వైన్‌షాపు, బార్లలో 40శాతం రిజర్వేషన్లు, వడ్డెర కులాలకు క్వారీలలో 33శాతం రిజర్వేషన్లు ఇవ్వడం హర్షదాయకమన్నారు. అలాగే నాయి బ్రాహ్మణకులాలకు దేవాదాయశాఖకు సంబంధించిన దేవాలయాల పాలక వర్గాలలో బోర్డు మెబర్లుగా అవకాశం కల్పించారనీ, కానీ రాష్ట్ర జనాభాల్లో 6శాతం వున్న రజకులను మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఎస్సీ జాబితాలో చేర్చే విషయంపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల రజకసంఘాల నాయకులు ముక్తకంఠంతో ఎస్సీ సాధన కోసం సంఘటితమై రాజకీయ పార్టీలకు అతీతంగా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే ఏలూరు పల్నాడు జిల్లా దాచేపల్లిలో రెండు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారనీ, 3వ రౌండ్ టేబుల్ సమావేశంను చిత్తూరులో 7వతేది ఆదివారం నిర్వహిస్తున్నట్లు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా రజకనాయకులు, రజక మేదావులు, రజకమహిళలు, రజక ఉద్యోగులు అందరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## సీఎంను కలసిన మండల అధ్యక్షుడు

రామకుప్పం, జూన్ 3 ప్రభాతవార్త:



మండలంలోని సమస్యలు, అభివృద్ధి పనుల కోసం సీఎం చంద్రబాబు నాయుడుకి టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ వినతి పత్రం అందజేశాడు. బుధవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించాడు. ఈ సందర్భంగా మండలంలోని ననియాల, ననియాల తాండ, రామాపురం తాండ, పంద్యాల మడుగు, పీఎంకే తాండ, ఎస్ గొల్లపల్లి, నారాయణపురం తండా పరిసర ప్రాంతాల్లోని రైతులు పండిస్తున్న పంటలపై ఏనుగులు దాడులు చేస్తున్నాయని వాటి నివారణ కోసం సోలార్ కం చె నిర్మాణం చేపట్టాలన్నారు. రామకుప్పం మెయిన్ రోడ్ లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని డివైడర్ ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించాలన్నారు. హంద్రీ నీవా కాలువ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి 23 చెరువులకు తాగు, సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాల్లో సిబ్బంది కొరత భర్తీ చేయాలన్నారు. విజలాపురంలోని వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు, మండల కేంద్రంలోని అన్నపూర్ణానంబ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, మహాద్వారం, గాలిగోపురం, ఇతర పనులకు నిధులు సమకూర్చి సహకరించాలన్నారు. మండలంలోని ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేసేలా చూడాలన్నారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని వెంకటరమణ తెలిపారు.

## పంటలపై జంట ఏనుగుల దాడులు

రామకుప్పం, జూన్ 3 ప్రభాతవార్త:

మండల పరిధిలోని ననియాల తాండలో జంట ఏనుగులు పంటలపై దాడి చేశాయి. మంగళవారం రాత్రి తిమ్మప్ప, నాగరాజు తదితరులు చెందిన టమాటా, టెంకాయ చెట్లు మామిడి పంటలపై పడి ధ్వంసం చేశాయి. ఏనుగుల ట్రాకర్లు టపాకాయలు పేల్చి మళ్లించే ప్రయత్నంలో వారిపై తిరుగుబడ్డాయి. వారు చాకచక్యంగా వెనుతిరిగి అటవీ ప్రాంతంలోకి పారదోలారు. నిత్యం ఏనుగుల దాడులతో రైతులు పంటలు నష్టపోయామన్నారు. పంట పొలాల వద్దకు వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులు పంటల పైకి చొరబడకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లదాం

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త:



ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నేతలపై ఉన్నదని యూనిట్ ఇంచార్జ్ బాలు పేర్కొన్నారు బుధవారం మండల పరిధిలోని సొన్నే గాని పల్లి, ఎంకేపురం పంచాయతీల సమన్వయ కమిటీ సమావేశాలు గుండి శెట్టిపల్లి లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నేతలు, కార్యకర్తలుపై ఉన్నదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు గ్రామాల్లో సిసి రోడ్లు, స్మశాన వాటిక, కొత్త పెన్షన్లు కావాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది ఈ కార్యక్రమంలో కో యూనిట్ ఇంచార్జ్ మునెప్ప, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శివానంద, పంచాయతీ పార్టీ మహిళా అధ్యక్షురాలు వేదశ్రీ, భాస్కర్, మంజునాథ రెడ్డి, అనిల్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు. అ లాగే మండలంలో అన్ని పంచాయతీల్లో కూడా సమన్వయ కమిటీ సమావేశంలో నిర్వహించారు.

# దోష రహిత ఓటర్ల జాబితా ‘సర్’తో సాధ్యం

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:



ఓటర్ల జాబితాలో అనర్హులు లేకుండా చూడటం ‘సర్’ ప్రక్రియ ప్రాథమిక ఉద్దేశం అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ‘సర్’ ప్రక్రియ ప్రాథమిక ఉద్దేశం అమలుపై సంబంధిత బిఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమన్నారు. ‘సర్’ స్ఫూర్తికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది నిబద్ధతతో సేవలు అందించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితా లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి ప్రణాళికా బద్ధంగా కృషి జరుగుతుందన్నారు. ఓటర్ల మ్యాపింగ్ విషయంలో బిఎల్‌ఓలు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జూన్ 5 నుండి 14వ తేదీ వరకు సన్నద్ధత కార్యక్రమాలు జరుగుతాయని, ఆపై జూన్ 15 నుండి జులై 14 వరకు బిఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతుందని వివరించారు. అర్హులను ఓటర్ల జాబితాలో వుండేలా చేయడంతో పాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలస వెళ్ళిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు వుండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా సర్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్ళి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాల్సివుంటుందన్నారు. సర్వే సమయంలో బిఎల్‌ఓలు తమ వద్ద తగినన్ని ఫారం-6, 7, 8 తదితరాలను అందుబాటులో వుంచుకోవాలన్నారు. అలాగే ప్రతి పోలింగ్ స్టేషన్‌లో గరిష్టంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం కావాలని, దీనిని దృష్టిలో వుంచుకుని కొన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ జరగాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ తహసిల్దారు కులశేఖర్, బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం!



తడ, జూన్ 3 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో నాయుడుపేట డివిజన్ పరిధిలో గంజాయి వినియోగ దారులపై పోలీసులు బుధవారం ఉక్కుపాదం మోపారు. తడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులోని ముద్దాయిలను రౌడీషీటర్లను మరియు మాంబట్టు ఎస్సీజడ్‌లోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు ఎన్‌డిపిఎస్ కిట్లు సహాయంతో మూత్ర పరీక్షలు నిర్వహించారు. మొత్తం సుమారు 60 మందికి పరీక్షలు నిర్వహించగా రౌడీ షీటర్లు ఇద్దరకు కార్మికులకు నలుగురకు మొత్తం 6 మందికి గంజాయి పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. దీని ఆధారంగా వారికి గంజాయి ఎక్కడను సరఫరా అవుతుంది అన్న విషయంపై విచారణ చేపట్టారు. సంబంధిత సరఫరాదారులు నెట్వర్క్ గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు మాట్లాడుతూ తిరుపతి జిల్లాను గంజాయి రక్షి త జిల్లాగా మార్చడమే మా ప్రధాన లక్ష్యమని గంజాయి వినియోగం, రవాణా మరియు విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ తడ ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## మునిశేఖర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



సూళ్లూరుపేట, జూన్ 3 ప్రభాతవార్త: వైఎస్సార్సీపీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దివంగత దువ్వూరు మునిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మునిశేఖర్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన ఉత్తర క్రియలలో ఆయన పాల్గొన్నారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి మునిశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మునిశేఖర్‌రెడ్డి అకాల మరణం పార్టీకి, కార్యకర్తలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెట్టి వేణు యాదవ్, స్వామి రెడ్డి, చిలక యుగంధర్, మునీష్ రెడ్డి, వి.కృపాకర్‌రెడ్డి, బుల్లిరెడ్డి, హరి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం : నేదురుమల్లి



బాలాయపల్లి, జూన్ 3 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్సీపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వంకు వెన్నుపోటు రెండేళ్ల కార్యక్రమంలో భాగంగా వెంకటగిరిలో పోస్టర్లన ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైయస్సార్సీపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ కౌన్సిలర్ పూజారి లక్ష్మి, కళ్యాణి, వైసిపి మహిళా నాయకురాలు రామ తులసి, మండల పార్టీ కన్వీనర్లు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు దశరథ రామ్‌రెడ్డి, సతీష్, సాయి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ మంత్రి చొరవతో టెక్నాలజీ రంగం అభివృద్ధి

**- ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి**



బాలాయపల్లి, జూన్ 3 ప్రభాతవార్త: ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రంలో టెక్నాలజీ రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నట్లు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. తైవాన్ దేశంలో కంప్యూటెక్స్, తైపీ 2026లో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. తైవాన్‌లో జరిగిన కంప్యూటెక్స్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంటర్‌ప్రైజ్ సర్వర్లు, స్టోరేజ్ టెక్నాలజీలు, ఆధునిక హార్డ్‌వేర్ తయారీ వ్యవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రముఖ టెక్నాలజీ సంస్థల ప్రతినిధులతో సమావేశమై భవిష్యత్ భాగస్వామ్యాలు, పెట్టుబడులు మరియు సాంకేతిక సహకార అవకాశాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ తయారీ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టికి అనుగుణంగా ఈ

## మత్తుకు దూరంగా ఉండండి...భవిష్యత్తును కాపాడుకోండి

**- డ్రగ్స్ ఫ్రీ శ్రీసిటీ లక్ష్యంతో నిరంతర చర్యలు**




సత్యవేడు, జూన్ 3 ప్రభాతవార్త: రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపడుతోంది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలోని ప్రతి సబ్ డివిజన్‌లో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. అనుమానిత ప్రాంతాలు, పరిశ్రమలు, కార్మికుల సమూహాలు, ఇతర గుర్తించిన ప్రదేశాలలో గంజాయి పరీక్షలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గంజాయి పరీక్షల్లో పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తులకు కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీసిటీ సబ్ డివిజన్ పరిధిలో శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షనలో శ్రీసిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.సుధీర్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు వద్ద ఉన్న అపోలో, సత్యవేడు మండలం మదనంబేడు గ్రామం వద్ద ఉన్న సంఖ్యి ఇండియా లేబర్‌షెడ్‌లలో ఉండే పరిశ్రమల కార్మికులకు మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజ మాన్యాలు, తల్లిదండ్రులు పోలీసుశాఖ సహకరించాలని శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మత్తుకు దూరంగా ఉండండి భవిష్యత్‌ను కాపాడు కోండి అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి శాఖ పోలీసుశాఖ కట్టుబడి ఉందని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1972 (ఈగల్), 112 పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే డ్రగ్స్‌ఫ్రీ తిరుపతి జిల్లా లక్ష్యాన్ని విజయవంతంగా సాధించగలమని శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు.

## వైసిపి ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా వుండాలి

**మాజీ మంత్రి ఆర్.కె.రోజా**



పుత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త : రాష్ట్రంలో త్వరలోనే జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని పర్యాటకశాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆరోపించారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) అత్యంత అప్రమత్తంగా పనిచేసి వైసిపి ఓట్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో 'సర్' కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క అభివృద్ధి కార్యక్రమం అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామని కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. అభివృద్ధి లేకపోగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. జగనన్న పాలన దూరం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లేనిపోని కారణాలు చూపించి రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం పథకం అమలు చేయడం లేదన్నారు. రెండేళ్లలో ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. వైసిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో రోజా గెలుపుతో పాటు జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రి చేయడంలో బిఎల్ఎల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. నగరి నియోజకవర్గంలో 2 లక్షల 3 వేల ఓట్లు వున్నాయని, ఈ నెల 15 నుంచి జూలై 14వ తేదీ వరకూ బిఎల్ఎలు పూర్తి బాధ్యతతో పనిచేసి ప్రతి ఓటు కాపాడుకోవాలన్నారు. మాజీ ఎంపి రెడ్డెప్ప తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఈఈ విజయాలతో నారాయణలో సంబరాలు




తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త: జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విశేష ర్యాంకులు సాధించిన నేపథ్యంలో స్థానిక నారాయణ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల హర్షధ్వానాల మధ్య సాగిన ఈ ర్యాలీ నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 15వ ర్యాంకును సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా తొలి వెయ్యి ర్యాంకుల్లో ఐదు స్థానాలు దక్కించుకోవడంతో పాటు దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. ఈ విజయాలను పురస్కరించుకుని సంస్థ యాజమాన్యం విజయోత్సవ ర్యాలీని నిర్వహించింది. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మార్‌పల్లిలోని నారాయణ ఐఐటీ అకాడమీ ప్రాంగణంలో ప్రారంభమైన ర్యాలీ బాలాజీ సర్కిల్, గాంధీ రోడ్ మీదుగా అన్నారావు సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా బాణాసంచా పేలుళ్లు, తప్పెట మోతలు, విద్యార్థినీ-విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజయోత్సాహంతో విద్యార్థులు నినాదాలు చేస్తూ ముందుకు సాగగా, నగరవాసులు రహదారుల వెంట నిలబడి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను అభినందించిన సంస్థ ప్రతినిధులు నిరంతర శ్రమ, నాణ్యమైన బోధన, క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా జాతీయ స్థాయిలో మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షి ంచారు. ర్యాలీలో డీజీఎం కొండలరావు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు రెండు వేల మందికి పైగా హాజరై విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## వైకాపాచే వెన్నుపోటుకు రెండేళ్ళు పోస్టర్ల ఆవిష్కరణ

**-ప్రజలు వాస్తవాన్ని గుర్తించండి: బియ్యపు**



శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త: తెలుగుదేశం రెండేళ్ల పాలనలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో 'వెన్నుపోటుకు రెండేళ్ళు' అంటూ పోస్టర్లతో పాటు బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మధుసూధనరెడ్డి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆయన విమర్శించారు. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన నమ్మశ్యం కానివన్నారు. మాయ మాటలు నమ్మి ఓటు వేసినందుకు ప్రజలు ఇప్పుడు మోసపోయామని బాధపడుతున్నారని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును అందించిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని మధుసూధనరెడ్డి అన్నారు. గతంలో జగనన్న ప్రభుత్వంలో ఎటువంటి ప్రచారం లేకుండా ప్రతి నెల పెన్షన్లు అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం కేవలం ప్రచారం కోసమే ఆర్భాటం చేస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులకు వరి మద్దతు ధర లభించటం లేదన్నారు. ఎరువుల కొరత వేధిస్తుందని ఏ ఒక్క సంక్షేమ పథకం సక్రమంగా అమలు కావటం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలా మంది తల్లిదండ్రులు పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక చదువులు ఆపేసి పనులకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిన ఈ వెన్నుపోటు పాలనను నిరసిస్తూ వైకాపా పార్టీ తరఫున ఈ నెల 4 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మధుసూధనరెడ్డి ద్వజమెత్తారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం మాజీ చైర్మెన్ ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రదాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, మాజీమార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, కోగిల సుబ్రమణ్యం, గున్నేరి కిషోర్‌రెడ్డి, ఉత్తరాజి శరవణ కుమార్, బుల్లెట్‌శ్యాం రాయల్ కంఠా ఉదయ్, మున్నా రాయల్, సురేష్, పులి రామచంద్ర, శివకుమార్‌యాదవ్, చెంచయ్యనాయుడు, మధు, మహబూబ్‌బాషా, జుంలేషా, గౌస్‌బాషా, కుమార్, వయ్యాల మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, గంగిరెడ్డి, జివికె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అలిపిరిలో ఉద్రిక్తత అటు వైపిసి ఇటు పోలీసులు

**-నిరసనకారుల అరెస్ట్‌తో ఆందోళన**



తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త: అలిపిరి వద్ద జీవనం కోసం పలు రకాలుగా వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదవారిని తొలగించి అరకు కాఫీ దుకాణానికి అనుమతించడం పట్ల వైసిపి నాయకులు నిరసన తెలిపారు. పేదల కడుపుకొట్టి టిడిపికి అనుకూలమైన నేత కోసం పేదలను తొలగించి అరకుకాఫీ దూకాణం పెట్టడం మంచిదికాదని వైసిపి తీవ్రస్థాయిలో మండిపడింది. పేదలపక్షాన నిలబడి వారికి న్యాయం చేయడానికి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో బుధవారం ఉదయం అలిపిరి వద్దకు చేరుకున్నారు. తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నాయకులు పసుపులేటి సురేష్, వాసు యాదవ్, దినేశ్‌రాయల్, ఉదయ్‌వంశీ, సాయి రాకేశ్, ఇమ్రాన్, దినేశ్, అనిల్, రాజేశ్, అజయ్, మహి, మహిళలు అలిపిరి వద్ద ధర్నాకు దిగారు. తిరుపతిలో పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్ననందున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. అక్కడ ఎలాంటి నిరసనలు చేయరాదని వైసిపి నేతలకు నోటీసులు ఇచ్చారు. అప్పటికీ అక్కడ పరిస్థితి చేయితప్పడంతో పోలీసులు బలవంతంగా వైసిపి నేతలను అరెస్ట్ చేశారు. సాయంత్రం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ నుంచి భూమన అభినయ్ రెడ్డికి 41 ఏ నోటీసులు ఇచ్చి పంపించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఖతార్ దేశంలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోండి

**- ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి**

బాలాయపల్లి, జోన్ 3 ప్రభాతవార్త: ఖతార్ దేశంలో హోం కేర్ నర్సుల ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. బిఎస్సి నర్సింగ్, జిఎన్ఎమ్ నర్సింగు విద్యాహరత కలిగిన 21 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు వయస్సు ఉన్నవారు అర్హులు అని తెలిపారు. నెలకు ఒక లక్షా ముఫైవేలు జీతం ఉంటుందని చెప్పారు. ఉచిత వీసా విమాన టికెట్లు యజమాని భరిస్తారని చెప్పారు. ఈనెల 9,10 తేదీల్లో ఆన్లైన్ ఇంట్రులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ నర్సింగ్ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వాకాడులో స్వచ్ఛ పథం కార్యక్రమం



వాకాడు, జూన్ 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహిస్తున్న స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా వాకాడు పంచాయతీలో బుధవారం రహదారుల పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట డీడీఓ టి. చిన్న రెడ్డెప్ప, డీఎల్‌డీఓ ఆధ్వర్యంలో వాకాడు మెయిన్ బజార్ నుంచి అశోక్ పిల్లర్ సెంటర్, చర్చ్ కాంపౌండ్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర పారిశుధ్య పనులు చేపట్టారు. డీడీఓ టి. చిన్న రెడ్డెప్ప స్వయంగా కార్యక్రమంలో పాల్గొని రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమంలో భాగస్వామ్య మయ్యారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట డీడీఓ టి. చిన్న రెడ్డెప్ప, డీఎల్‌డీఓ, వాకాడు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎం. సాయి ప్రసాద్, నెల్లిపూడి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సి.హెచ్. శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో (పంచాయతీ) దేవదానం, వాకాడు2 గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సూళ్లూరుపేట డీడీఓ టి. చిన్న రెడ్డెప్ప వాకాడు ఎస్‌డబ్ల్యూఎంపీసీ షెడ్‌ను సందర్శించి అక్కడి నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. షెడ్‌లోని సౌకర్యాలు, పరిశుభ్రత నిర్వహణపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ఫోటో

## బిఎల్వోలుతో తహసిల్దార్ సమావేశం

వాకాడు, జూన్ 3 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం తహసిల్దార్ సయుద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేయాలని బిఎల్ఓలకు ఆయన సూచించారు, 18 సంవత్సరాలు పూర్తయిన వారందరికీ ఉన్నా కూడా నమోదు చేసే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతి ఒక్కరు పని చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వీఆర్వోలు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆక్రమణను పరిశీలించిన డిడిఓ



వాకాడు, జూన్ 3 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని వాకాడు చర్చి కాంపౌండ్ నుండి గురుకుల పాఠశాల వెళ్లే రోడ్ సైడ్ కాలువ ఆక్రమణపై బుధవారం సులూరుపేట డిడిఓ చిన్న రెడ్డప్ప పరిశీలించారు. పిజిఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిడిఓ చిన్న రెడ్డప్పతో పాటు ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ సిబ్బంది ఉన్నారు, టిడిపి నేత దినకర బాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వర్షాలు కురిసిన, చర్చి కాంపౌండ్ నుండి గురుకుల పాఠశాల మీదుగా ముట్టెంబాక చెరువులోకి వెళ్లేదని, అదేవిధంగా వాడుకున్న నీరు కూడా ఆ కాలవ గుండే వెళ్లేదని అయితే భూస్వాములు కాలువను పొలంగా మార్చేసుకోవడంతో చెత్త చెదారంతో కూడిన మురికి నీరు తోపాటు వర్షపు నీరు కూడా ఇళ్లల్లోకి వస్తున్నాయని డిడిఓకి తెలిపారు. డిడివో చిన్న రెడ్డప్ప పూర్తి స్థాయిలో సర్వే చేయించిన వెంటనే కాలువ ఉంటే ఏర్పాటు చేసి వర్షపు నీరు మురికి నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులకు ఆయన సూచించారు.

## వాకాడులో ఎమ్మెల్యేకు జన్మదిన వేడుకలు



వాకాడు, జూన్ 3 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో వంద అడుగుల ఎత్తులో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ కటౌట్‌కి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేసి, రోజా మాల వేసి కేక్ కట్ చేసి పలు వరకు టిడిపి నాయకులు పంచిపెట్టారు, వంద అడుగుల కటౌట్ ఎమ్మెల్యేకి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేస్తుంటే గుంపులు గుంపులుగా అభిమానులు ప్రజలు సందడి చేశారు. అదే విధంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎమ్మెల్యేకు కేక్ కట్ చేసి టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు, వాకాడు బజారు వీధిలో టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, వేము దినకర్ బాబు, చరణ్ రెడ్డి, అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ దువ్వూరు భార్గవ్, ఎంబేటీ కోటయ్య, మైనార్టీ నాయకుడు రంతుల, టిడిపి నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

**-కిక్కిరిసిన ఆస్థానమండపం**



కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవ స్థానంలో బుధవారం సంకటహర గణపతి వ్రతంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో బుధవారం అధిక జ్యేష్టమాసం సంకటహర చతుర్థి వత్రంను ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు దఫాలుగా అర్చకులు నిర్వహించారు. ఈమేరకు ఉదయం 9,11 గంటలకు, సాయంత్రం, 3,5 గంటలకు వ్రతాన్ని నాలుగు దఫాలుగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు



కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో ఉదయం 9, 11 గంటలకు, సాయంత్రం 3, 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను నాలుగు ధఫాలుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపే రీతిలో అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

-ఫలించిన చైర్మెన్ ప్రయత్నం



**ఏర్పేడు,జూన్ 3 ప్రభాతవార్త:**

తిరుపతి నుంచి తూర్పు మండలాల్లోని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులననడుపుతున్నట్లు ఆర్‌టిసి నిర్వాహకులు ప్రకటించారు. స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, గుడిమల్లంలోని పరశురామేశ్వ రాలయం చైర్మెన్ బత్తల గిరినాయుడు ప్రయత్నం ఫలించింది. ఈ మేరకు బుధవారం ప్రయోగాత్మకంగా బస్సును తిరుపతి నుంచి గుడిమల్లం,శ్రీకాళహస్తి ఆలయాలకు బస్సును నడిపారు. ఒక టిక్కెట్టు విలువ రూ.105లుగా ఖరారు చేసినట్లు చైర్మెన్ గిరినాయుడు వివరించారు. గిరినాయుడు మీడియాతో మాట్లాడుతూ గుడిమల్లం ఆలయం రోజు రోజుకు ప్రజాదరణ పొందుతుంది. ఇటీవల ఆలయానికి కుంబాభిషేకం నిర్వహించిన తరువాత ఆలయ ప్రాశస్త్యం పెరిగిందని చైర్మెన్ గిరినాయుడు వివరించారు. మొదటి రోజు ప్రయోగాత్మకంగా ఆర్‌టిసి బస్సును నడిపారన్నారు. మొదటి ట్రిప్పులో 70 మంది భక్తులతో పాటు మంగళం రీజినల్ మేనేజర్ జగదీఫ్, డిపోమేనేజర్ సుధాకర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ స్థార్ కృష్ణల పర్యవేక్షణలో బస్సులో వచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తమ సారధ్యంలో స్వాగతం పలికినట్లు తెలిపారు. భక్తులకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికి సుదర్శనం ఏర్పాటు చేసామన్నారు. అదే బస్సులో తానుకూడా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వెళ్ళి అక్కడస్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారన్నారు.భక్తులతో కలసి శ్రీకాళహస్తికి పయనించటం తనకు ప్రత్యేక అనుభూతి కల్గిందన్నారు.ఈ బస్సు ప్రతి రోజూ మూడు ట్రిప్పులు నడుస్తుందన్నారు. బుధవారం ట్రయల్ రన్‌లో ఒరెండవ ట్రిప్‌లో 50మంది భక్తులు వచ్చారన్నారు.

**ఆర్‌టిసి అధికారులకు ధన్యవాదాలు:**

పరశురామేశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌బ త్తల గిరినాయుడు మాట్లాడు తూ ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సూచనల మేరకు తాను ఆర్‌టిసి అధికారులతో కలసి చర్చించగా వారు సానుకూలంగా స్పందించారని వివరించారు. ప్యాకేజికి సంబంధించి తాను శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓతో చర్చించినపుడు ప్యాకేజి భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. తాము ప్రతిపాదించిన వెంటనే ఆర్‌టిసి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇక గుడిమల్లంలో ప్యాకేజి బస్సుల్లో వచ్చే భక్తులకు ప్రత్యేకద ర్శనం ఏర్పాటుకు ఇఓ మునిశేఖర్ ఆమోదించారని గిరినాయుడు వివరించారు. తాము ఆలయాభివృద్ధికి చేపడుతున్న ప్రయత్నాలన్ని విజయవంతం అవుతున్నాయని తెలిపారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా రుద్రా రైడ్ యాప్ ఆవిష్కరణ

**తిరుపతి విద్య,జూన్ 3 ప్రభాతవార్త :**



ఆన్‌లైన్ టాక్సీ బుకింగ్ సేవలను మరింత వేగవంతంగా, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష ్యంతో రూపొందించిన రుద్రారైడ్ యాప్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యాప్‌ను ప్రారంభించి లోగోను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. రుద్రా రైడ్ సీఈవో తోట హిమశ్రీ, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ టాక్సీ బుకింగ్ యాప్‌లతో పోలిస్తే మరింత సమర్థవంతమైన సేవలను అందించేలా రుద్రా రైడ్‌ను రూపొందించామని తెలిపారు. కారు, ఆటో, స్కూటర్ సేవలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సాయి కళాధరాచారి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## 5న విత్తన దినోత్సవం

– రైతులకు నాణ్యమైన విత్తనాల విక్రయం

**తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త:**



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్), తిరుపతిలో ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి. చంద్రిక తెలిపారు.విశ్వవిద్యాలయ ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల ప్రయోజనార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే బెట్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి ఎద్దడిని తట్టుకునే పంటల ప్రణాళిక, అనువైన పంట రకాలు, వాటి లభ్యత, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన పలు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. వేరుశనగలో బెట్టను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే విశిష్ట (టీసీజీఎస్1694) బ్రీడర్ విత్తనాలు, నువ్వులలో వైఎల్ఎం146 ఫౌండేషన్ విత్తనాలు, వైఎల్ఎం66 ట్రూత్‌ఫుల్లీ లేబుల్డ్ విత్తనాలు, కందుల్లో టీఆర్‌జీ56 బ్రీడర్ విత్తనాలు, అనపకాయలో అధిక దిగుబడినిచ్చే టీఎఫ్‌బీ1, టీఎఫ్‌బీ2 రకాల బ్రీడర్ విత్తనాలు రైతులకు విక్రయించనున్నట్లు తెలిపారు.అలాగే పరిశోధన స్థానం విడుదల చేసిన వివిధ పంట రకాల ప్రదర్శన, సాంకేతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వి. చంద్రిక కోరారు.

## అగ్నివీరులుగా...ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

**తిరుపతి విద్య,జూన్ 3 ప్రభాతవార్త:**



భారత సాయుధ దళాల్లో ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అగ్నివీర్ పథకం కింద ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపిక కావడం పట్ల కళాశాల వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలకు చెందిన ఎల్‌సీపీఎల్ ఎం. పవన్, ఎల్‌సీపీఎల్ ఎల్. ప్రవీణ్ అగ్నివీరులుగా ఎంపికై కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు.అగ్నివీర్ నియామక ప్రక్రియలో ఈ ఇద్దరు క్యాడెట్లు విశేష ప్రతిభ కనబరిచారు. ఎన్‌సీసీ ద్వారా పొందిన బి, సి సర్టిఫికెట్ల ఆధారంగా లభించే అదనపు మార్కులు, ప్రత్యేక ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకుని ఎంపికలో విజయాన్ని సాధించారు. కఠినమైన శారీరక దారుఢ్య పరీక్షలు, రాత పరీక్షల్లో ఉత్తీర్ణులై భారత సాయుధ దళాల్లో సేవలందించే అవకాశాన్ని దక్కించుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణ ఎంపికైన క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, దేశభక్తి పెంపొందుతాయని, ఇవే వారిని సాయుధ దళాల్లో ఉన్నత స్థానాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ పి. హరీశ్ రెడ్డి, ఫ్లైట్ లెఫ్టినెంట్ పి. ఉదయతో పాటు అధ్యాపకులు కూడా క్యాడెట్లను అభినందించి వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. దేశ రక్షణ బాధ్యతల్లో భాగస్వాములు కాబోతున్న ఈ యువకులు కళాశాలకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

## ఎండలతో మంటలు...వర్షంతో చల్లబడ్డ శ్రీకాళహస్తి

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం బుధవారం ఉదయం నుంచి ఎండలతో మంటలతో జనం తల్లడిల్లిపోయారు. బాబోయ్ ఇవేమి ఎండలంటూ బెంబేలెత్తారు. ఓవైపు ఎండ తాకిడి మరో వైపు నిప్పులను మరిపిస్తూ సెగలతో జనం తల్లడిల్లి పోయారు.ఇళ్ళలో ఎసిలు వేసుకున్నా చెమటలు తగ్గలేదు. సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణంలో కొంత మార్పువ చ్చింది.హఠాత్తుగా ఆకాశంలో మబ్బులతో వేడి తగ్గింది. పది నిముషాల పాటుచినుకులతో వాతావరణం చల్లబడింది.జనం హమ్మయ్యా! అని ఊపిరి పీల్చుకున్నారు.

## కొండమిట్టలో గంగమ్మకు సారె

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తిలోని కొండమిట్టలో బుధవారం గంగమ్మ జాతర అంగరంగవైభవంగా నిర్వహించారు. స్థానిక సంప్రదాయంతో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను అందించారు.ఆయన తన సహచరులతో ఆలయ వద్దకు రాగా ఆలయ కమిటి సారధ్యంలో ఘన స్వాగతం పలికారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ 18సంవత్సరాలుగా ప్రతి వారం వార్షిక జాతర మహోత్సవం సంప్రదాయబద్ధంగా సారె సమంర్పించటం తన అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమాల్లో జనమాల గురవయ్య, పుట్టం రాజాముదిరాజ్, సురేష్, అవుల శ్రీనివాసులు, శంకర్, షఫీ, చెంబేటి సురేష్, గోపి,బాలాజి, రమణ,శ్రీను, విజయ్, మణి,దినేష్, మహేష్, మహాదేశ్, ప్రసాద్, ఆషీస్‌లున్నారు. జాతర మహోత్సవాన్ని కమిటి ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి భక్తులు మొక్కులు తతీర్చుకున్నారు

## కాసరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచన మేరకు వాసన్ ఐ కేర్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలోని సచివాలయంలో కంటి పరీక్షలు చేశారని బుధవారం తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్ను రాఘవుల యాదవ్ పత్రికల వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసన ఐ కేర్ ద్వారా గ్రామంలో 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 15 మందికి కళ్ళజోడు అవసరం రాగా మరి కొంతమందికి డ్రాప్స్ ద్వారా ఆరు మందికి ఆపరేషన్లు అవసరం రాదా వారికి ఉచితంగా చేస్తామని వారు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంటి అసిస్టెంట్ మేనేజర్ ధర్మ,సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇంచార్జ్ చింతపట్ల భాస్కర్ నాయుడు తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, సంద్ర మహేష్ నాయుడు లు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మిక వర్గం కదలాలి

-కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించిన ఏఐటీయూసీ

**వరదయ్యపాలెం, జూన్ 3 ప్రభాతవార్త:**




నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మిక వర్గం కదలాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీ యూసీ సమర శంఖం పూరించింది. అందులో భాగంగా ఏఐటియుసి సత్యవేడు నియోజకవర్గ ఆఫీస్ బేరర్ సమావేశం అన్నాదొరై అధ్యక్షతన వరదయ్యపాలెంలో బుధవారం జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ఏఐటియుసి సత్యవేడు నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు అంబాక చిన్ని రాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడం జరిగిందని ఈ లేబర్ కోడ్లు అమలు కావడం వల్ల కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారుతారని, సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు కోల్పోతారని, ఎనిమిది గంటల పని విధానం కోల్పోయి, పది నుండి 13, 14 గంటలు పనిచేయాల్సిన పరిస్థితులు వస్తాయని అందుకోసం ఏఐటియుసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.అందులో కార్మిక వర్గం కదలి రావాలి అని కోరారు. రాష్ట్రంలో, కూటమీ ప్రభుత్వం కేంద్రంలో తీసుకువచ్చే కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో శర వేగంగా అమలుపరచడానికి ప్రయత్నిస్తోందని, లేబర్ కోడ్‌లలో లేని ఎరతులు ఈ రాష్ట్రంలో అమలు పరుస్తుందన్నారు.రానున్న కాలంలో పోరాటాలకు శ్రీకారం చుట్టాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పూర్తిస్థాయిలో తిరిగి పునరుద్ధరించాలని, ఆటో, హమాలీ, టాక్సీ, వీధి వ్యాపారస్తులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం కార్మిక వర్గం కదలాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి చంద్ర, అధ్యక్షులు అన్నాదురై, జిల్లా నాయకులు చంద్రబాబు, నాగేంద్ర, నాయకులు సుభాష్, వాణి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద వితరణ పాత్రల బహూకరణ

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు అందిస్తున్న ఉచిత ప్రసాదాలకు ఇత్తడి పాత్రలను భక్తులు అందించారు. సుమారు రూ.2.3లక్షల విలువ కల్గిన ఏడు అండాలను చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ సమక్షంలో అందించారు.పుత్తూరు మండలం రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన శ్రీరంగం మిల్క్ ప్రాడక్ట లిమిటెడ్ వారు శ్రీకాళహస్తీశ్వరుని నిత్యభక్తులు, వారు ప్రతి ఏడాది ఏదో ఒక వితరణను అందించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఈ ఏడాది వారు ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకొని బయటకు వచ్చే భక్తులకు ప్రసాదాలు ఇవ్వటానికి పాత పాత్రలు వాడుతుం డటంతో కొత్త పాత్రలను అందించారు. వీటిని ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు ధర్మకర్తల మండలి సభ్యులు పగడాల మురళి, నాగరాజు, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తికి చెందిన భక్తులు విరాళం అందించారు. బుధవారం పట్టణానికి చెందిన బి.శ్రీదేవి వారి కుమార్తె వేదిరెడ్డి మాదవి జ్ఞాపకార్థం స్వామి వారి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50,116లు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆమె ఆలయ ఎఇఓ మోహన్ ద్వారా దేవస్థానంకు అందించారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాల దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## శివయ్య సేవలో సంగీత దర్శకులు తమన్

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో బుదవారం ప్రముఖ సినీ సంగీత దర్శకులు తమన్ పలువురు గాయకులు పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.చైర్మెన్ పర్యవేక్షణలో వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. తమన్‌తో పాటు గాయకులు శ్రీ కృష్ణ, శృతిరంజని, అత్విత్తీయలు ఉన్నారు.వారికి స్వాగతం పలికిన వారిలో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌తో పాటు సభ్యులు నాగరాజు, పౌరోహితులు అర్ధగిరి స్వామి పిఆర్ఓ కార్యాలయానికి చెందిన రవి, దుర్గాప్రసాద్, అభిషేక్ సాయిలు పాల్గొన్నారు.

## ఆకతాయిల ఆగడాలకు హద్దులేదు!

-ప్రధాన వీధులకే పరిమితమైన పోలీసు పెట్రోలింగ్

**శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త:**




శ్రీకాళహస్తిలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు వీధుల్లో పెచ్చుపెరిగి పోతున్నాయి. పోలీసు లంటే భయం లేకుండా పోయింది. ఓ వైపు గంజాయి బ్యాచ్ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు శాంతి భద్రతల దృష్ట్యా చర్యలు కేవలం ప్రధాన వీధుల్లో పెట్రోలింగ్‌కే పరిమితమౌతున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 22వ వార్డులోని ఎన్‌టి నగర్‌లో ముగ్గురు ఆకతాయిలు బీభత్సం సృష్టించారు.ఓ కారు అద్దాలను తలతో ఢీ కొట్టినట్లు సమాచారం. కారు అద్దాలను పగులగొట్టిన ఆతని తల ఎంత గట్టిదో అని చర్చించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ముగ్గురు యువకులు తప్పతాగి ఆగడాలు సృష్టించినట్లు చర్చించుకుంటున్నారు. మైకంలో వారు ఏం చేస్తున్నారో ఏమో తెలియని మైకంలో ఇలా చేసారని చెప్పుకుంటున్నారు.పోలీసులు రాత్రి వేళల్లో ప్రధాన మార్గాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. కానీ పలు వీధుల్లో ఆకతాయిల ఆగడాలకు హద్దులేకుండా ఉంది. అయితే సమస్యను వివరిస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారని ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలో ప్రత్యేక గస్తీ నిర్వహించాల్సి ఉందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

## మండల సమస్యలపై చర్చలు

**తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన యూనిట్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లో, ఆయా కట్ట అధ్యక్షులు, యూనిట్ పరిధిలో శ్రీకాళహస్తి, నియోజకవర్గం, శాసనసభ్యులు, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి తొట్టంబేడు మండలం, కాసరం గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించామని తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసం చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలందరూ మమేకమై వారి సమస్యలను ఇక్కడ విన్నవించడం జరిగిందని దీనిని మండల అధ్యక్షుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తాము పరిష్కరించుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, యూనిట్ ఇంచార్జ చింతపట్ల భాస్కర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ యువత అధికార దిప్రతినిధి, చెన్ను రాఘవులు యాదవ్ బూత్ కన్వీనర్ బొర్రా, దివ్య, హాయ్ కట్టి నెంబర్, ఆళ్ల మారయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు, పర్చూరు వెంకటరమణ గౌడు,ఐకట్ట అధ్యక్షులు, మురళి, నాయకులు సంద్ర మహేష్ నాయుడు, మస్తాన్ నాయుడు, పిల్లమేడు బాల కృష్ణ,సిద్దయ్య, కొండయ్య, గనిమినేని మురళి నాయుడు, సంద్ర,మస్తాన్ నాయుడు మామిడి గుంట,బాలరాజు జనసేన నాయకులు, ప్రభాకర్, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన తిరుపతి కార్పొరేట్ క్రికెట్ లీగ్

## – ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభం

తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త:



చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి కార్పొరేట్ క్రికెట్ లీగ్ (టీసీఎల్) బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గొల్లవానిగుంటలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి, టాస్ నిర్వహించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ క్రీడా మౌలిక వసతుల కల్పనతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికే నిర్వహించిన సీపీఎల్1, సీపీఎల్2 టోర్నీలకు విశేష స్పందన లభించిందని, అదే ఉత్సాహంతో తిరుపతి కార్పొరేట్ లీగ్‌ను ప్రారంభించామని తెలిపారు. ఎనిమిది జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని, అన్ని మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుమంత్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఎడిఫై విద్యాసంస్థల అధినేత ప్రణీత్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ తక్కువ కాలంలోనే జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి విశేష కృషి చేసిందని ప్రశంసించారు. క్రీడాకారుల అభివృద్ధికి అసోసియేషన్‌కు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, సీడీసీఏ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్ యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్ కుమార్, జాయింట్ సెక్రటరీ కోలాహరి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

–నివాస ప్రాంతంలో నిర్మాణంపై స్థానికుల ఆందోళన

తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త:



నివాస ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. తిరుపతి నగరంలోని సంజయ్ గాంధీ కాలనీలోని చంద్రశేఖర్ రెడ్డి కాలనీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.స్థానికుల కథనం మేరకు, ఓ ఇంటి ఐదో అంతస్తుపై ప్రైవేటు టెలికాం సంస్థకు చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు సంస్థ ప్రతినిధులు ఆ ఇంటి యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. సుమారు ఆరు నెలల క్రితమే టవర్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అప్పట్లో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.అయితే మంగళవారం రాత్రి కార్పొరేషన్, పోలీసు అధికారుల సహకారంతో టవర్ ఏర్పాటు పనులను తిరిగి ప్రారంభించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కాలనీ మహిళలు బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిర్మాణ పనులను అడ్డుకున్నారు.స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.ఆందోళనలో శాంతి, కే. లక్షి ్మ, అంకమ్మ, రాజ్యలక్షి ్మ, రమణమ్మ, రమాదేవి, రమణ, దేవకి తదితర మహిళలు పాల్గొన్నారు.

## దళితులకు భూమి హక్కు కల్పించండి

–ఎండిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి శేఖర్

–ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



చిన్నగొట్టిగల్లు,జూన్ 3 ప్రభాతవార్త:

మండలంలోని రంగన్నగారిగడ్డ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను దళితులకు అందజేసి వారి భూ హక్కులను పరిరక్షి ంచాలని రాష్ట్ర ఎండిపిఎస్ అధ్యక్షుడు పెద్దపల్లి శేఖర్ ఏపీ ఎండిపిఎస్ నాయకులు అధికారులను కోరారు. ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమిం చుకుని దళితులకు అందకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు మండల రెవెన్యూ అధికారులను, జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. 2024 డిసెంబర్ 25న తహసీల్దార్‌కు, అలాగే స్పందన కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు భూములను కొలిచి చూపించడంలోనూ, ఆక్రమణలు తొలగించడంలోనూ అధికారులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను రక్షి స్తామని చెబుతున్న అధికారులు ఆక్రమణదారులకే అండగా నిలుస్తున్నారని, దీంతో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రీ సర్వే ప్రక్రియలో కూడా దళితులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ భూములపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, అర్హులైన దళిత కుటుంబాలకు భూమి హక్కులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిపిఎస్ జిల్లా అధ్యక్షుడు గురుశంకర, ఎండిపిఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్ల పంపిణీ

పూతలపట్టు, జూన్ 3 ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీతుషార్ డూడి ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణ, ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో చేపట్టిన జన విశ్వాస్–సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. గోపి పూతలపట్టు మండలంలోని ఆటోరిక్షాలకు ప్రత్యేక స్టిక్కర్లను పంపిణీ చేసి అతికించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ గోపి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రజలతో పోలీసు శాఖకు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆటోరిక్షాకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన స్టిక్కర్లను అందజేసి వాహనాలపై అతికించినట్లు తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత ఆటో, డ్రైవర్, యజమాని వాహనానికి సంబంధించిన అధికారిక వివరాలు తక్షణమే అందుబాటులోకి వచ్చే విధంగా ప్రత్యేక వ్యవస్థను రూపొందించినట్లు వివరించారు. అలాగే ప్రజలకు మరింత విశ్వసనీయమైన, భద్రతాయుతమైన రవాణా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ గారు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి, ఆటో ప్రయాణాల సమయంలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న భద్రతా సౌకర్యాలను వినియోగించుకోవాలని ఇన్స్పెక్టర్ గోపి సూచించారు.

## పార్టీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తాం!

చిట్వేల్, జూన్ 3 ప్రభాతవార్త:



స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపి పార్టీని బలోపేతం చేసేందుకు కట్టుబడి పని చేస్తామని టిడిపి మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ కోసం సూచించిన విధి విధానాలను గ్రామస్థాయి, మండల స్థాయి యూనిట్ ఇన్చార్జిలతో కలిసి సమావేశం నిర్వహించారు. కాకర్ల మాట్లాడుతూ ఇకపై ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ స్థాయి సమావేశం, రెండవ బుధవారం మండల స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. తద్వారా గ్రామ కమిటీలు, క్లస్టర్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మరియు అనుబంధ సంఘాల అభిప్రాయాలను సేకరించి, పార్టీ చేపడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు.అలాగే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రతి బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీ నుండి అమలులోకి రానున్న పింఛన్ కార్యక్రమానికి సంబంధించి అవ్వాతాతలకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, అర్హులైన ప్రతి పింఛన్ లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అందరికీ సూచించినట్లు కాకర్ల తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటేష్ రాజు, కోక్లస్టర్ ఇన్‌చార్జ్ గిరిబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ బండారు శివ, బాలు రెడ్డయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం మెనూ చార్జీ పెంచాలి

వడమాలపేట, జూన్ 3 ప్రభాతవార్త:



మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికుల మెనూ చార్జీ కనీసం 20 రూపాయలు పెంచాలని ఏఐటీయూఐసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వడమాలపేట ఉన్నత పాఠశాలలో మండలంలోని మిడ్‌డే మీల్స్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది.మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదని, మధ్యాహ్న భోజన కార్మికులకు 3 వేలు చెల్లిస్తున్నారని, కనీసం 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, అలాగే ఏఎస్ఐ, పిఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మెనూ చార్జీని ఒక్కో విద్యార్థికి రూ.20 చేయాలన్నారు. అలాగే కార్మికులకు రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, పెండింగ్ జీతాలు బిల్లులు వెంటనే చెల్లించాలని, బిల్లులు ప్రతి నెల 5వ తేదీ లోపు పడేలా చూడాలని డీఈవో సంతకంతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. పాఠశాలల్లో వెంటనే వంట గదులు నిర్మించాలని, వంట పాత్రలను కనీసం ఐదు సంవత్సరాలకు ఒక సారి కొత్తవి కొని ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సౌకర్యం లేని స్కూళ్ళకు వెంటనే గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని, ప్రభుత్వమే వంట గ్యాస్‌ని ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8 సోమవారం జిల్లా సమావేశాన్ని నిర్వహించుకుని తిరుపతి డీఈవోతో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై చర్చించడం జరుగుతుందని వారు అన్నారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తులసి, నగరి నియోజకవర్గ నాయకులు చంద్రబాబు, ఏఐటీయూసీ నాయకులు మహేష్ గోపి, చంద్రమ్మ, చెన్నమ్మ, సంధ్య వాణి, వసంత, సంధ్య, చెంగన్న, తులసి, సుబ్బమ్మ, భారతి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుకు గురై టీడీపీ నాయకుడు మృతి



వడమాలపేట, జూన్ 3 ప్రభాతవార్త:

వడమాలపేట మండలం పూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం పాముకాటుకు గురై బుధవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూడి గ్రామానికి చేరుకుని భౌతిక కాయం సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ధనంజయులునాయుడు, టీడీపీ నాయకులు ఉన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో...నగరాన్ని పరిశుభ్రం చేద్దాం : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 3 ప్రభాతవార్త:



పభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా బుధవారం ఉదయం నగరంలోని సుబ్బారెడ్డి నగర్, కొర్లగుంట, భవానీ నగర్, టిటిడి పరిపాలన భవన్ పక్క సందులో పెద్ద మురుగునీటి కాలువలను శుభ్రం చేసే ప్రక్రియను మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణతో కలసి పరిశీలించారు. ప్రభుత్వం ఒక నెల రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా అన్ని మున్సిపాలిటీల్లో చెత్తను శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమం లో పాల్గొని మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. నగరంలోని కాలువల్లో చెత్త వేయడం వలన అవి అక్కడే ఆగిపోయి దోమలకు ఆవాసంగా మారుతుందని తెలిపారు. ఆ దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఇటువంటి కార్యక్తమాల వలన ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లలిత, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అరణియార్ నదిలో...జేసీబీలతో ఇసుక మాఫియా అఘాయిత్యం

నాగలాపురం, జూన్ 3 ప్రభాతవార్త:



నాగలాపురం మండలం కారణి గ్రామ సమీపంలోని అరణియార్ నదిలో ఇసుక మాఫియా రెచ్చిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇచ్చిన అనుమతులు ఒక ప్రాంతానికి ఉండగా, వాస్తవానికి మరో చోట భారీ స్థాయిలో జేసీబీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నది పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను వినియోగించి ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు అక్రమ తవ్వకాలు పెరుగుతుండడంతో నది సహజ స్వరూపం దెబ్బతింటోందని, భూగర్భ జలాలపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లోను ఇసుక రవాణా కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలపై విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాలను అడ్డుకుని అరణియార్ నది పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మోదీ సుపరిపాలన

ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలి -బిజెపి చీఫ్ మాధవ్

తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త:



ప్రదానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల సుపరిపాలన ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వీ.ఎన్.మాధవ్ కోరారు. మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సామాజిక సంక్షేమం వరకు అన్ని రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని ఆయన తెలిపారు. జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం తిరుపతికి విచ్చేసిన ఆయనకు తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వరప్రసాద్, పురుషోత్తం నాయుడు, నరేష్ కుమార్ రెడ్డి, బాబు, మల్లారపు రవి, ప్రసాద్, వేదవతి రాయల్, తేజోవతి, డాక్టర్ శ్రీధర్ ముని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## కేంద్ర పథకాల ప్రయోజనాలపై

ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి-బిజెపి చీఫ్ మాధవ్

తిరుపతి,జూన్ 3ప్రభాతవార్త:



కేంద్ర పథకాల వల్ల లబ్ధి పొందుతున్న వర్గాలను మరింతగా చేరుకోవడంతో పాటు, వాటి ప్రయోజనాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ సూచించారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఇదే సరైన సమయమని పేర్కొన్న ఆయన, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు.జిల్లా పర్యటన ముగించుకుని సాయంత్రం హౌరా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు బయలుదేరిన మాధవ్ కు రైల్వే స్టేషన్‌లో పార్టీ నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్,రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మాధవ్‌ను సత్కరించారు.

## మునిసిపాలిటీలో సమస్యలు పరిష్కరించండి

పుత్తూరు(నగరి), జూన్ 3 ప్రభాతవార్త :

నగరి మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ బాలాజీ నాయక్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. చాలా వార్డుల్లో మురికినీటి కాల్వల పరిస్థితి అధ్వాన్నంగా వుందని తెలిపారు. వీధి దీపాలు వెలగడం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరా సమస్యలున్నాయన్నారు. ముఖ్యంగా నగరి శ్మశాన వాటిక దుర్గంధంగా, అపరిశుభ్రంగా వుందని తెలిపారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెబుతూ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చొరవతో త్వరలోనే మునిసిపాలిటీకి నిధులు వస్తున్నాయని వాటిలో డ్రైనేజీ మరమ్మతులు, సిమెంట రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ టిడిపి అధ్యక్షుడు జి.గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసన్, జిల్లా నాయకులు జ్యోతి నాయుడు, కరుణ, పట్టణ నాయకులు మునిరత్నం, సలీమ్, గౌరి రమేష్, నెత్తం శివ, దొరస్వామి, మణికండం, మహేంద్రబాబు వున్నారు.

## స్మశాన వాటికను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 3 ప్రభాతవార్త:



ఎంఆర్ పల్లి పల్లి స్మశాన వాటికను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానికుల పిర్యాదు మేరకు కమిషనర్ శారదా దేవి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి బుధవారం ఉదయం ఎమ్మెల్యే స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మశాన వాటిక విస్తరణకు అడ్డంకిగా ఉన్న ఇంటి పట్టా సమస్యకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి పరిస్కరించినట్లు చెప్పారు. అలాగే ఎస్పిడిసిఎల్ కు ఎంత స్థలం ఉందో సర్వే మిగిలిన స్థలంలో స్థానికుల కోరిక మేరకు స్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు ఆయన తెలిపారు. స్మశాన వాటిక లో కమ్యూనిటీ హాల్, కాంపౌండ్ వాల్ వెంటనే ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పిస్తామని ఆయన చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ ఎంఆర్ పల్లి స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్,.డిఈ. మహేష్, సర్వేయర్ కోటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.